

ఐటీఐతో ఉపాధికి భరోసా

ఐటీఐలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

8లో▸

నిప్పుల కొలిమి

కౌటాల(సిర్పూర్): జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. కాగజ్‌నగర్, దహెగాం మండలాలు రెడ్‌జోన్‌లో ఉన్నాయి. మంగళవారం జంబుగాలో గరిష్ట ఉష్ణోగ్రత 45.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, కుంచవెల్లిలో 45.3, కెరమెరి 43.4, కౌటాల 43.2, ఎల్కపల్లి 43.0, వంకులం, రవీంద్రనగర్ 42.8, లోనవెల్లి 42.6, బెజ్జూర్ 42.4, తిర్యాణిలో 42.2 డిగ్రీలుగా నమోదైంది.

గరిష్టం/కనిష్టం
42.6 /30.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రివేళ కూడా వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు ఊరూరా చెరువుల పండుగ



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న ఊరూరా చెరువుల పండగను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, రాజేశం, ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల పండగ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. చెరువు కట్టల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అలంకరించాలన్నారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో హాజరు కావాలని కోరారు. ఆటపాటలతో కట్టమైసమ్మకు పూజలు నిర్వహించి, హాజరైన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 పరీక్షకు పది కేంద్రాలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గ్రూప్- 1 పరీక్షకు పది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ రాజేశం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో గ్రూప్- 1 పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 11న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, డీఈవో అశోక్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో రాజేశ్వర్

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌వో రాజేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఐఈవో శ్రీధర్‌సుమన్‌తో కలిసి మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.

ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని డీఐఈవో శ్రీధర్‌సుమన్ పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో జనరల్‌లో 1,284 మంది, ఒకేషనల్‌లో 113 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో 623 మంది, ఒకేషనల్‌లో 118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

విత్తనమే దైవం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మొహతుక్(విత్తన) పూజలు కనుల పండువగా సాగుతున్నాయి. కొద్దిరోజులుగా పల్లెల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది. వ్యవసాయమే ఊపిరిగా జీవిస్తున్న గిరిజనులు విత్తనాలను దైవంగా భావించి ప్రత్యేక పూజలతో సాగు పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. అరకలు, విత్తనాలతో ఇంటిల్లిపాది పొలంబాట పట్టారు.

- గిరిజన పల్లెల్లో పండుగ వాతావరణం
- పొలం బాట పట్టిన ఆదివాసీ కుటుంబాలు
- మృగశిర కార్తెకు ముందు మొహతుక్ (విత్తన) పూజలు



అరకకు పూజలు చేస్తున్న రైతు కుటుంబం

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీలు జూన్ ప్రారంభం నుంచే సాగు పనులకు శ్రీకారం చుడతారు. ముఖ్యంగా అనాదిగా వస్తున్న సంప్రదాయాలకు పెద్దపీట వేస్తారు. ఈ నెల 8న మృగశిర కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివాసీ గ్రామాలు విత్తన పూజలతో ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. మృగశిర కార్తె ప్రారంభానికి మూడు, నాలుగు రోజుల ముందు నుంచే ఈ పూజలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే గిరిజన రైతులు వేసవి దుక్కులు దున్ని చేలను సాగుకు సిద్ధం చేశారు. బుధవారంతో మొహతుక్ పూజలు ముగియనుండటంతో ఇంటిల్లిపాది అరకలు, ఎద్దులు, విత్తనాలతో పొలంబాట పట్టారు. ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల్లో ఈ సంస్కృతి అధికంగా కనిపిస్తుంది.

ప్రత్యేక సమావేశం..

సాగు పనుల ప్రారంభానికి ముందే అన్ని ఆదివాసీ పల్లెల్లో రైతులు గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. సాగు పనులు, కుల దేవతలకు నిర్వహించాల్సిన పూజల గురించి చర్చిస్తారు. పటేల్ ఇంటి ఎదుట సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తారు. గిల్లిదండా వంటి ఆటలు ఆడుతారు.

కొన్ని గ్రామాల్లో ఇలా..

కొన్ని ఆదివాసీ గ్రామాల్లో చంచి భీమల్ దేవుడి వివాహం మే నెలలో జరిగిందని నమ్ముతూ రైతులు ఏటా అన్ని రకాల విత్తనాలను ఈ భీమల్‌దేవుడి సన్నిధికి తీసుకెళ్తారు. పూజలు చేసిన అనంతరం ఆరు డొప్పల్లో అన్ని విత్తనాలను కలుపుతారు. మృగశిర కార్తె ప్రారంభం తర్వాత విత్తనాలను చేలల్లో చల్లుకుని సాగు ప్రారంభిస్తారు.

ఆదివాసీల ఆరాధ్య దేవతలైన పాటేరు అమ్మోరు, జంగుబాయి అమ్మవారు, గాంధారి ఖిల్లా, పద్మల్ పురి కాకో ఆలయాలకు వెళ్లి విత్తనాలను చూపిస్తారు. అనంతరం గ్రామాల్లో కొలువైన ఆకీపేన్, అమ్మోరు, పోచమ్మ ఆలయాల వద్ద విత్తనాలతో పూజలు చేస్తారు. అదేరోజు రాత్రి రెండున్నర కిలోల జొన్నలతో గట్కా(అన్నం) వండి ఆరగిస్తారు. అడవుల నుంచి తెచ్చిన కుమ్మిడ్ ఆకుల డొప్పల్లో విత్తనాలను ఉంచుతారు.



పూజలు చేస్తున్న మహిళలు, రైతులు

గ్రామాల్లో పూజలు



నేటితో మొహతుక్ ముగియనుండటంతో మంగళవారం గ్రామాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. ఆదివాసీ దేవతలకు మొక్కిన తర్వాతే సాగు ప్రారంభించడం అనాదిగా వస్తోంది. ఆదివాసీ ఆచారాలను కాపాడుకుంటాం.

– కోవ ఇందిర, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

నేలతల్లితో అనుబంధం



ఆదివాసీలకు నేలతల్లితో ప్రత్యేక అనుబంధం ఉంది. చేలలో విత్తనాలు విత్తుకునే ముందే కులదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తాం. ఇలా చేస్తే ప్రకృతి సహకరించి పంటలు బాగా పండుతాయనే నమ్మకం ఉంది.

– ధర్మారావు, చౌపన్‌గూడ, మం.కెరమెరి

అడవులే అడ్డాలు!



సిర్పూర్(టి)లో పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు (ఫైల్)

- పులి సంచారం ఉన్న ప్రాంతాల్లో జోరుగా పేకాట స్థావరాలు
- మే 27న భీమన్న గుడి అటవీ ప్రాంతంలో పేకాటరాయుళ్ల అరెస్ట్
- పోలీసుల నిఘాను తప్పించుకునేందుకు జూదరుల ఎత్తుగడ

కౌటాల(సిర్పూర్): జిల్లాలో పేకాటరాయుళ్ల దృష్టి అటవీప్రాంతాలపై పడింది. పోలీసుల కళ్లు కప్పి రూ.లక్షల్లో జూదం ఆడుతున్నారు. ఓ వైపు పోలీసుల దాడుల పెరుగుతున్నా జూదానికి అడ్డుకట్ట పడటం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా జూదరులు అడవులను అడ్డాలుగా మార్చుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, రెబ్బెన, దహెగాం, సిర్పూర్(టి), ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో పేకాట జోరుగా సాగుతోంది. ఒక్క మేలోనే పోలీసులు కాగజ్‌నగర్ డివిజన్ పరిధి లో 19 మందిపై కేసు నమోదు చేయగా, రూ. 13.17 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

టైగర్ జోన్‌లో అక్రమంగా..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో విస్తారంగా అడవులు ఉన్నాయి. అధికారులు ఈ ప్రాంతాన్ని అధికారికంగా టైగర్‌జోన్‌గా ప్రకటించకపోయినా పులుల సంచారం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా కాగజ్‌నగర్, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల పరిధిలో పులులు స్వేచ్ఛగా సంచరిస్తున్నారు. గ్రామ శివారు ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు గట్టి నిఘా ఉంచడంతో జూదరులు తమ వ్యూహాలు మార్చుకున్నారు. ఏకంగా పులి ఇలాకలోనే పేకాట స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాగజ్‌నగర్– కౌటాల ప్రధాన రహదారి సమీపంలోని భీమన్న గుడి అటవీ ప్రాంతలో జోరుగా జూదం ఆడుతున్నారు. పులి సంచరించే ప్రాంతంలో అయితే ఎవరూ అక్కడి వచ్చే ధైర్యం చేయరనే భరోసాతో ఉంటున్నారు. మే 27న సిర్పూర్(టి) మండలంలోని భీమన్నగుడి వద్ద కొంత మంది వనభోజనాలు చేసిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులకు పక్కా సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టారు. మొత్తం 14 మందిని అదుపులోకి తీసుకుని, నిందితుల వద్ద నుంచి రూ.13.11 లక్షల భారీ నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో రూ.2వేల నోట్లు పెద్ద మొత్తంలో పట్టుబడటం గమనార్హం.

వరుస దాడులు..

మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల్లో గల దాబాల్లో పేకాట జోరుగా సాగుతుంది. అక్కడికి జిల్లా నుంచి పేరుమోసిన పేకాటరాయుళ్లు తరుచూ వెళ్తుంటారు. ఆరు నెలలుగా మహారాష్ట్ర ప్రభుత్వం పేకాట స్థావరాలపై మెరుపు దాడులు చేసి కఠిన చర్యలు తీసుకుంటోంది. దీంతో నిర్వాహకుల దృష్టి సరిహద్దు మండలాలైన కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాలపై పడింది. ఇందులో భాగంగానే మే 27న కాగజ్‌నగర్ మండలం నజ్రూల్ నగర్ విలేజ్ నం.12 గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సిర్పూర్(టి) మండలంలోని అటవీప్రాంతంలో 14 మంది పట్టుబడ్డారు. ఈ ఏడాది కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు సుమారు 60 మందికి పైగా జూదరులపై కేసు నమోదు చేశారు. రూ.లక్షల్లో నగదు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన పేకాట నిర్వాహకుల కన్ను జిల్లాపై పడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పేకాట ఆడుతున్న వారిపై కఠిన శిక్షలు లేకపోవడం, న్యాయస్థానంలో జరిమానా కట్టి బయటకు వచ్చే అవకాశం ఉండటంతో యువత కూడా జూదానికి అలవాటు పడుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పేకాటకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సిర్పూర్(టి) అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేసి భారీగా నగదు పట్టుకున్నాం. పేకాట, ఆన్‌లైన్ మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. పేకాటతో జీవితాలు నాశనమవుతాయి. గ్రామాల్లో జూదం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అక్రమ దందాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి, నిందితులపై చర్యలు తీసుకుంటాం.

– సాదిక్ పాషా, సీఐ, కౌటాల

పరిశ్రమల అభివృద్ధికి కృషి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్లబ్‌లో పారిశ్రామిక ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగ అభివృద్ధికి పెట్టుబడి రాయితీ, అమ్మకపు పన్ను, విద్యుత్ వాడకం చార్జీలు, భూమి కొనుగోలు రాయితీలు, ఉద్యోగ నైపుణ్యాభివృద్ధి కోసం ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల ఖర్చుపై రాయితీ, మహిళా పారిశ్రామికులకు అదనపు ప్రోత్సాహం వంటి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. సిర్పూర్ కాగితం మిల్లు మూతపడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం అత్యధిక రాయితీ ప్రకటించి పునఃప్రారంభించిందన్నారు. నూతన పరిశ్రమల స్థాపనకు అన్ని మండలాలలో అనుకూల వాతావరణం ఉందన్నారు. జిల్లాలో జిన్నింగ్, రైస్ మిల్లులతో పాటు సిరామిక్స్ పరిశ్రమలు, చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఐటీ, ఈసీ విభాగంలో అధిక లావాదేవీలు, ఆధార్ సర్వీస్‌లు చేసిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఉత్తమ కార్మికులను సన్మానించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి రఘు, ఈడీఎం మేనేజర్ గౌతం కుమార్, ఎస్పీఎం ఉపాధ్యక్షుడు మిశ్రా, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ గిరీశ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు చిలువేరు సత్యనారాయణ, ఎస్పీఎం జీఎం గిరి, పారిశ్రామికవేత్తలు కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, తదితరులు

దొంగ దొరకలే..!

- స్టేషన్ నుంచి తప్పించుకుని పరారీ
- పదకొండు రోజులుగా రామారావు కోసం పోలీసుల గాలింపు
- ఘటనపై జిల్లా పోలీసు బాస్ సీరియస్
- విచారణకు ఆదేశం.. బాధ్యులపై చర్యలు?



బేడీలతో రామారావు (ఫైల్)

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచి పారిపోయిన దొంగ టేకం రామారావు అజ్ఞాతం వీడలేదు. అతను పరారై నేటికీ పదకొండు రోజులు. పోలీసులు దొంగ ఆచూకీ కనిపెట్టడడం కోసం విఫలయత్నం చేస్తున్నారు. ఓ దొంగతనం కేసులో అదుపులోకి తీసుకున్న వ్యక్తి తమ నుంచి తప్పించుకోవడాన్ని పోలీసులు జీర్ణించుకోలేకపోతున్నారని సమాచారం. తొలుత ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి.. 'ఆసిఫాబాద్‌లో ఓ దొంగ సంచరిస్తున్నట్లు.. అతని ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తాం' అని ఓ ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. అయితే దొంగ స్టేషన్ నుంచి పరారైన విషయాన్ని 'సాక్షి' ఈ నెల 1న వెలుగులోకి తీసుకురావడంతో అసలు రంగు బయటపడింది. ఈ ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారి సీరియస్ అయ్యారు. ఘటనపై విచారణకు ఆదేశిస్తూ.. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

స్టేషన్‌లో ఉంచి విచారణ..

ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలోని తారకరామ నగర్‌లో నివసిస్తున్న రిటైర్డ్ టీచర్ గుర్రాల వెంకటేశం ఇంట్లో ఇటీవల చోరీ జరిగింది. బంగారు ఆభరణాలతోపాటు నగదు పోయినట్లు సమాచారం. దొంగతనం జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు ఇది టేకం రామారావు పనేనని నిర్ధారణకు వచ్చి గాలిస్తుండగా.. ఈ క్రమంలోనే రామారావు తన సోదరుడిని కలిసేందుకు ఆసిఫాబాద్ వచ్చాడు. కేస్లాపూర్‌లో రామారావు ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు గత నెల చివరి వారంలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. మే 27న టేకం రామారావుని తారకరామనగర్‌కు తీసుకొచ్చి దొంగతనం జరిగిన తీరుపై పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు తెలుస్తోంది. అనంతరం దొంగను స్టేషన్‌లో ఉంచి విచారించారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ దొంగతనాలకు పాల్పడింది.. సొత్తును ఎక్కడ దాచింది.. విక్రయించింది.. తదితర అంశాలపై ఆరా తీశారు. కొన్ని రోజులపాటు రామారావుని స్టేషన్‌లో బేడీలతో ఉంచినట్లు చూసిన కొందరు పేర్కొంటుండగా.. 28న మాత్రం అతని బేడీలు తొలగించి ఉంచినట్లు తెలుస్తోంది. ఇదే అదనుగా భావించి దొంగ పరారయ్యాడు. ఈ విషయం తెలిసి తొలుత గాబరా పడ్డ పోలీసులు తర్వాత తీరిగ్గా 'ఆచూకీ తెలిపితే పారితోషికం' అనే నాటకానికి తెరతీయడం విశేషం.


పోలీసు బాస్ సీరియస్..

'గతంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు, ఇతర ప్రాంతాల్లో అనేకసార్లు దొంగతనాలకు పాల్పడ్డ టేకం రామారావు ప్రస్తుతం ఆసిఫాబాద్ పట్టణంలో దొంగతనం చేయడమే లక్ష్యంగా సంచరిస్తున్నాడు. ఇతన్ని ఎవరైనా చూసినా.. అతని ఆచూకీ తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వండి. దొంగ ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.' అంటూ మే నెల 30న ఒక ప్రకటన స్థానిక పోలీసుస్టేషన్ నుంచి విడుదల చేయగా.. అందరూ నిజమేనని నమ్మారు. కానీ తమ్ముడి ఆచూకీ తెలపాలంటూ అన్నను రెండు రోజులపాటు పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించడం.. అతని ఊరంతా పోలీసు వాహనంలో కూర్చొబెట్టి రామారావు కోసం గాలించడం తెలిసిన తరువాత దొంగ పరారైన విషయం 'సాక్షి' కథనం ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్పీ కె.సురేశ్‌కుమార్ తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. పారిపోయిన దొంగను వెంటనే పట్టుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. అలాగే దొంగ పారిపోయిన ఘటనపై విచారణకు ఆదేశిస్తూ.. ఆ సమయంలో స్టేషన్‌లో విధుల్లో ఉన్న పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. విచారణ తర్వాత దొంగ పారిపోవడానికి కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, జిల్లా జడ్జి, అధికారులు, ప్రజాప్రతినిధులు



గుస్సాడీ కళాకారుల ప్రదర్శన



కెరమెరి సీఐ శ్రీనివాస్‌కు సన్మానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవా రం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గుస్సాడీ నృత్యాలు, దేశభక్తి గీతాలతోపాటు ఆర్కెస్ట్రా పాటలు అలరించాయి. పోలీస్ కళాబృందం ద్వారా బాల్య వివాహాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక అంశాలపై, షీంసేవలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదివాసీ పాట పాడి ఆకట్టుకున్నారు. గుస్సాడీ కళాకారులు గంగారాం, కిక్రి కళాకారులు వెద్మ శంకర్, తిరుపతి, వాంకిడి సీఐ శ్రీనివాస్ తమ పాటలతో ఉర్రూతలూగించారు. అనంతరం కళాకారులను శాలువలతో సన్మానించారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్, ఎస్పీ సురేశ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: ప్రధాని మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ రూపొందించిన నెలరోజుల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త పాటుపడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం మోర్చాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ 2014 మే 26న ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్ల పరిపాలనలో ప్రధానమంత్రిగా మోదీ ఎన్నో పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. దేశం అగ్రస్థానానికి చేరేలా పలు నిర్ణయాలు ధైర్యంగా తీసుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన నియామకం

భీమారం(చెన్నూర్): గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ లిమిటెడ్ జిల్లా చైర్మన్‌గా మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము అశోక్‌యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై రవి కుమార్ తెలిపారు. రెండు నెలల క్రితం ఆస్పత్రి సమీపంలో కిందపడి ఉండగా గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని వయస్సు 55 సంవత్సరాలు ఉంటాయని, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 8712656562 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుల, చేతివృత్తులకు రూ.లక్ష సాయం

మంచిర్యాలటౌన్: కుల, చేతివృత్తులు చేసుకునే వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. https:// tsobmmsbc. cgg. gov. in వెబ్‌సైట్‌లో ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20 నుంచి 26 వరకు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు దరఖాస్తుల పరిశీలన, సెలక్షన్ అయిన తర్వాత ఈ నెల 27 నుంచి జూలై 4 వరకు కలెక్టర్ వేసిన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేస్తారని ఆయన పేర్కొన్నారు. జూలై 15 వరకు మొదటి విడతలో చెక్కులు అందిస్తారని తెలిపారు. ఈ నెల 9న సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో పథకాన్ని జిల్లాలో అధికారికంగా ప్రారంభించనున్నట్లు సమాచారం.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సిబ్బంది

జన్నారం(ఖానాపూర్): జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ప్రశాంత్ ఈ నెల 2న జన్నారంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అదేరోజు జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుగొన్న పోలీసులు మంగళవారం బాధితునికి అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబల్ రవీందర్ తెలిపారు.

ఐటీఐతో ఉపాధికి భరోసా



మంచిర్యాలలోని ఐటీఐ కళాశాల

- ప్రవేశాలకు ఈ నెల 10 వరకు గడువు
- ఉమ్మడి జిల్లాలో 18 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు
- అందుబాటులో 2,480 సీట్లు

మంచిర్యాలఅర్బన్: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఐటీఐ చదువులు అందుబాటులో ఉండడమే కాకుండా త్వరగా ఉపాధిని అందిస్తున్నాయి. పదోతరగతి పూర్తయిన వెంటనే రెండేళ్ల వ్యవధిలోనే ఉపాధి చూపిస్తున్నాయి. పారిశ్రామిక అవసరాలకు తగిన మానవ వనరులను అందించేందుకు ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ)లు ప్రవేశపెట్టారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. పదో తరగతిలో విద్యార్థులకు వచ్చిన గ్రేడింగ్ ఆధారంగాసీట్లు కేటాయించనున్నారు.

కోర్సులు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు 6, ప్రైవేటు ఐటీఐలు 12 ఉన్నాయి. మంచిర్యాలలోని నాలుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 520, ఆదిలాబాద్‌లోని రెండు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 280 సీట్లు ఉన్నాయి. మంచిర్యాలలోని ఆరు ప్రైవేట్ కళాశాలల్లో 704, కుమురంభీంలోని ఒక ప్రైవేటు ఐటీఐలో 120, ఆదిలాబాద్‌లోని రెండు ప్రైవేట్ ఐటీఐలల్లో 280, నిర్మల్‌లోని మూడు ప్రైవేటు ఐటీఐలల్లో 480 సీట్లు ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు htpp// iti. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడాదిలో పూర్తయ్యే కోర్సులు

కోపా, డీజిల్ మెకానిక్, వుడ్‌వర్క్, టెక్నీషియన్, వెల్డర్, సేవింగ్ టెక్నాలజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫ్యాషన్ డిజైనింగ్, డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రఫీ.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ఐటీఐలు	ట్రేడ్స్	సీట్లు
మంచిర్యాల	ప్రభుత్వ	4	520
	ప్రైవేట్	6	704
కుమురంభీం	ప్రైవేట్	1	120
ఆదిలాబాద్	ప్రభుత్వ	2	376
	ప్రైవేట్	2	280
నిర్మల్	ప్రభుత్వ	–	–
	ప్రైవేట్	3	480
మొత్తం			2,480

దరఖాస్తు చేసుకోవాలి

ఐటీఐలో ప్రవేశపెట్టిన అన్ని కోర్సులకు విస్తారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు విస్తృతం చేయడానికి ఐటీఐలు ఏర్పాటు చేశారు. అర్హులైన విద్యార్థులు ఐటీఐలో ప్రవేశానికి ఈ నెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– చందర్, ప్రిన్సిపాల్, ఐటీఐ, మంచిర్యాల

మంచిర్యాల, ఆదిలాబాద్‌లోనే..

ఉమ్మడి జిల్లాలోని కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐ ఒక్కటి కూడా లేదు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూర్‌లో మాత్రమే ప్రభుత్వ ఐటీఐలున్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన మంచిర్యాల జిల్లాలో నాలుగు ఉన్నాయి. ఆరు ట్రేడ్‌లలో (224 సీట్లు), శ్రీరాంపూర్‌లో రెండు ట్రేడ్‌లు (96 సీట్లు), జన్నారంలో మూడు ట్రేడ్‌లలో (88) సీట్లు), మందమర్రిలో నాలుగు ట్రేడ్‌లలో (112 సీట్లు) అందుబాటులోఉన్నాయి.

రెండేళ్ల కోర్సులు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్ మెకానిక్, మోటార్ వెహికిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్, డ్రాఫ్ట్‌మెన్ సీవీ, మిషనిస్ట్ టర్నర్ కోర్సులు ఉన్నాయి.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత?

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతంలో మంగళవారం నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు సమాచారం. వరంగల్ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీస్ బృందం మెరుపుదాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకుని అధికమొత్తంలో నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విత్తనాలు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరి వద్ద కొనుగోలు చేశారు? ఇంకా ఎంతమంది వద్ద ఈ నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే కోణంలో విచారణ చేస్తున్న పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా ఇంత వరకు తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో స్టాండింగ్ కమిటీ ఆన్‌లేబర్ టెక్స్‌టైల్స్ అండ్ సిల్క్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంతో కూడిన లీవ్‌లు ఇవ్వాలని, వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇనుపనూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దొడ్డి నిర్మల, బండారి శ్యాంసుందర్, నాయకులు భూమయ్య, రమేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు చేరిన నల్గొండ, నిజామాబాద్ జట్లు



తలపడుతున్న నల్గొండ, మంచిర్యాల జట్లు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం సెమీఫైనల్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. నల్గొండ, మంచిర్యాల జిల్లా జట్ల మధ్య చివరి వరకు ఆసక్తిగా సాగిన పోరులో 2–0 గోల్స్‌తో నల్గొండ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్, మెదక్‌ల మధ్య జరుగగా 1–0 గోల్స్‌తో నిజామాబాద్ జట్టు గెలుపొందింది. బుధవారం ఉదయం నల్గొండ–నిజామాబాద్ జట్ల మధ్య ఫైనల్ పోటీ జరుగనుంది.

విద్యుత్‌షాక్‌తో ఇద్దరికి గాయాలు

- నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటు పనులు చేస్తుండగా ఘటన



ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

తాండూర్(బెల్లంపల్లి): విద్యుత్‌షాక్‌తో ఇద్దరు కార్మికులు గాయాలపాలైన సంఘటన మండలంలోని మాదారం 3 ఇంక్లైన్ వద్ద చోటు చేసుకుంది. మాదారం 3 ఇంక్‌లైన్ నుంచి నర్సాపూర్ గ్రామ పంచాయతీలోని బెజ్జాల వరకు ఐటీడీఏ నిధులతో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన సత్తర్, ఇబ్రాయిల్ స్తంభాలు ఎక్కి తీగలు అమరుస్తున్నారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా జరగడంతో షాక్ గురై కిందపడిపోయారు. గమనించిన స్థానికులు ఆటోలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఎల్‌సీ తీసుకుని పనులు నిర్వహిస్తున్నట్లు కార్మికులు చెప్తుండగా విద్యుత్ సరఫరా ఎలా జరిగిందనేది తెలియడం లేదు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ కు విద్యుత్ సరఫరా జరిగే అవకాశాలు లేవని, ఆ లైన్ పక్కనుంచే వాటర్ గ్రిడ్‌కు వెళ్తున్న 11కేవీ విద్యుత్‌లైన్ నుంచి ఇండక్షన్ జరిగి ఎర్త్ లాగా స్వల్ప విద్యుత్ సరఫరా జరిగి ఉండడంతోనే వారు కిందపడి ఉండవచ్చని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

9న ఉచిత చేపమందు పంపిణీ

దండేపల్లి(మంచిర్యాల): మృగశిరకార్తే సందర్భంగా ఈ నెల 9న దండేపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో అస్తమా వ్యాధిగ్రస్తుల కోసం ఉచిత చేపమందు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన రంగసాయి ప్రేమ్‌సాగర్, భూలక్ష్మి దంపతులు ఈ చేపమందు వేయనున్నారు. మరిన్ని వివరాలకు 9440707416, 9866885308, 9908401985, 7601046055 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పోలీస్ బెటాలియన్ విస్తృత కార్యక్రమాలు



నిత్యావసర సరుకులు అందిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం కొలాంగూడలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ సురేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గిరిజనులకు నిత్యావసర సరుకుల కిట్లు, విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, బూట్లు, చెప్పులు అందజేశారు. అనంతరం గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సురేశ్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, బెటాలియన్ వైద్యాధికారులు డాక్టర్ సంతోశ్‌సింగ్, డాక్టర్ శ్రీధర్, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిజ్ఞాస సంచార ప్రయోగశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. భౌతిక, రసాయన, జీవశాస్త్ర అంశాలు బోధించే అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సైన్స్‌లో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ చేసిన వారు ఈ నెల 8 లోగా డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అభినంద్‌రాజుకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఇన్నోవేషన్ చాలెంజ్‌కు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2023కు గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు ఎంపికైంది. ఇన్నోవేషన్ సెల్, ఇంక్విలాబ్, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ నిర్వహిస్తుంది. ఈ నెల 20 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు 125 ప్రదర్శనలను ఆన్‌లైన్‌లో పంపించారు. గర్మిళ్ల విద్యార్థులు విష్ణువర్ధన్, సీహెచ్ సాత్విక్, ఎం.వరలక్ష్మి, సీహెచ్ రిత్విక్ తయారు చేసిన ప్రాజెక్టు బహుళ ప్రయోజన ఫోల్డబుల్ లోడ్ క్యారియర్ ఎంపికైందని డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు తెలిపారు.

హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన టీవీ

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని 4వ వార్డులో మంగళవారం విద్యుత్ హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు అంబేడ్కర్ కాలనీకి చెందిన పలువురు ఇళ్లలోకి హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో కాలనీకి చెందిన దుర్గం రజితకు చెందిన కూలర్, చిలుముల దేవమ్మకు చెందిన కూలర్, రాంటెంకి కరుణకు చెందిన టీవీ, అనవేణి సుమలతకు చెందిన కూలర్‌తో పాటు ఫ్యాన్, దయ్యాల లక్ష్మికి చెందిన ఫ్యాను, నందు సింగ్‌కు చెందిన టీవీతో పాటు దుర్గం భరద్వాజ్‌కు చెందిన కంప్యూటర్‌తో పాటు ప్రింటర్ దగ్ధమయ్యాయి. ఈ విషయమై ఏఈ ఇమ్రాన్‌ను సంప్రదించగా బలమైన ఈదురుగాలుల కారణంగా కాలనీకి విద్యుత్ సరాఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూటల్ వైరు తెగిపోవటంతో హైఓల్టేజీ సరాఫరా అయినట్లు తెలిపారు.

సుదర్శన్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ మృతి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని కటకం సతీష్‌కుమార్ నివాసంలో సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తన జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్, రమేశ్, రాధ, ఆకాష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

11న ప్రజాగర్జన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 11న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఏరియాలోని కేకే–5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది వేజ్‌బోర్డు విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, వారి మాటలు పట్టించుకోవద్దన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటిపథకం అమలు చేసి రెండు గుంటల భూమి, రూ. 20 లక్షల రుణ సౌకర్యం కల్పించాలని, నూతన బొగ్గు బ్లాకులను ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, రాజేశం, శ్రీనివాస్, తిరుపతి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని, మారుపేర్లతో పని చేసే వారిని క్రమబద్ధీకరిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ నెల 9న నస్పూర్‌లో కలెక్టరేట్ ప్రారంభించేందుకు వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి హామీలను అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ యూని యన్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు, నాయకులు బోడకుంట శంకర్, రాజయ్య వెంగల శ్రీని వాస్, రాజేశం, పిట్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న తూముల శ్రీనివాస్

పాతమంచిర్యాల: ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తూముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఈ నెల 9న జిల్లా పర్యటనలో హామీలపై ప్రకటన చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టారన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని చెప్పి రైతులపై కేసులు నమోదు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి నాలుగు నియోజకవర్గాలకు సాగునీరు అందించాలన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి ఎ.లాల్‌కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, నాయకులు తిరుపతి, మల్లన్న, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

షెజల్ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- మాజీ మంత్రి గడ్డం వినోద్



మాట్లాడుతున్న మాజీ మంత్రి వినోద్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అతని అనుచరుల వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించిన ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి షెజల్ ఘటనలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, కాంగ్రెస్ నేత గడ్డం వినోద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో షెజల్‌ను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై ఇంతటి అరాచకం జరిగినా ఎవరూ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నేషనల్ ఉమెన్ రైట్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. షెజల్‌కు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు.